

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

11 అక్టోబర్ 2025 పేజీలు : 08 శనివారం




మహిళపై సామూహిక అత్యాచారం కేసులో

## ఇద్దరికి జీవిత ఖైదు

'వాళ్ళు నలుగురు.. ఆమె ఒక్కరు.. రాత్రంతా నరక యాతన చూపారు. వదిలేయమని ఎంతగా ప్రాధేయపడ్డా.. ఆ మృగాలు కనికరం చూపలేదు. అత్యాచారమే తమ వీరత్వంగా నిర్జన ప్రదేశంలో నిర్దయగా వ్యవహరించారు. వారిలో ఇద్దరు కేసు విచారణ సమయంలో చచ్చిపోయారు. మరో ఇద్దరికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. హృదయ విదారకమైన ఈ దారుణ సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇన్నాళ్లకు న్యాయం జరిగింది. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి.

*నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :*

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం సమీపంలో రాత్రి సమయంలో నిలబడి ఉన్న ఒక ప్రేమ జంటలోని మహిళను బలవంతంగా నలుగురు నిందితులు సమీప ఇసుక దిబ్బలలోకి తీసుకెళ్లి అనాగరికంగా.. అమానుషంగా.. సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని నమోదైన కేసులో సూళ్లూరుపేట వాసి, రెండవ నిందితుడు తిరువల్లూరు నవీన్ కుమార్, తిరుపతి వాసి 3వ నిందితుడు కాకుల దేవలపై ఆరోపణలు సాక్ష్యాధారాలతో రుజువైనందున వారికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. కాగా కేసులోని మొదటి నిందితుడు వెంకటగిరి వినయ్, నాలుగవ నిందితుడు తమిళ్ సెల్వం కేసు విచారణ మధ్యలో చనిపోయినందున వారిపై కేసు

-మిగతా 2లో



రైతాంగ సంక్షేమంతోపాటు..

దేశ ప్రగతికి

## ఎంతో మేలు



- రైతులు-పర్యావరణ సంక్షేమం, పశుజాతుల పరిరక్షణ, విద్యార్థులకు ఈ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగం
- నందగోకులం లైఫ్ స్కూల్ పేరిట మూడు మంచి ప్రాజెక్టులను చేపట్టిన చింతా శశిధర్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు నాయుడు
- దగదర్తి విమానాశ్రయం పనులు వేగవంతం చేస్తాం

**బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

*నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :*

బయో ఇథనాల్ ప్రాజెక్టు రైతుల సంక్షేమంతోపాటు, పర్యావరణ పరిరక్షణకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన ప్రజల నిద్దేశించి ప్రసంగించారు. నందగోకులం లైఫ్ స్కూల్ పేరిట మూడు మంచి ప్రాజెక్టులను చేపట్టిన చింతా శశిధర్ ఫౌండేషన్‌కు అభినందనలు.. ఈ ప్రాజెక్ట్ దేశప్రగతికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తోందన్నారు. దీని కోసం 15 వేల

-మిగతా 2లో

సర్వేపల్లిలో కోటి సంతకాల

## ఉద్యమానికి శ్రీకారం

వివరాలు 2లో



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ పోరాటం ప్రారంభం

సర్వేపల్లి గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ ఘనంగా ప్రారంభించారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయం



సమయపాలన పాటించని

## మండల పరిషత్, రెవెన్యూ అధికారులు

**తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్న మండల ప్రజలు**

సైదాపురం మండల కేంద్రంలో మండలపరిషత్, తహసిల్దార్ కార్యాలయ అధికారులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. సరైన సమయానికి వచ్చి ప్రజల సమస్యలు పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వివరాలు 5లో

# రైతాంగ సంక్షేమంతోపాటు దేశ ప్రగతికి ఎంతో మేలు





(మొదటి పేజీ తరువాయి)

టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ దేశ ప్రగతికి తోడ్పడుతున్నారు. అలాగే పశు సంపదను, మన వారసత్వాన్ని కాపాడేందుకు నూతన ప్రయోగం చేయటం అభినందనీయం అని ప్రశాంసించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్న చింతాశశిధర్ ఫౌండేషన్‌ను సీఎం అభినందించారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే కాన్సెప్టులో భాగమే పీ4, డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమూ ముఖ్యమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీరో పావర్టీ పీ4 లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లటం అందరికీ ఆదర్శనీయమన్నారు. సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయని, 150 టీఎంసీల నీళు ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉన్నాయని, భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఉంచుతామన్నారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం పోర్టులు కూడా జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయన్నారు. దగదర్తి విమానాశ్రయం కూడా త్వరలోనే వస్తుందన్నారు. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతోందన్నారు. 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందన్నారు. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామన్నారు.



రూ.88 వేల కోట్లతో దేశ చరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారన్నారు. ఇథనాల్ ప్లాంట్ ద్వారా పర్యావరణానికి మేలు కలగటంతో పాటు రైతులకూ ఆదాయవనరులుగా ఈ ప్రాజెక్టు మారుతుందన్నారు.





# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** జిల్లాలో పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్‌స్కూల్, నంది పవర్ బుల్ ప్రాజెక్టు, విశ్వసముద్ర బయో ఎనర్జీ ఈథనాల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. తొలుత ఈదగాలి గ్రామ సమీపంలోని నందగోకులం హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 3.14 గంటలకు సీఎం చేరుకున్నారు. సీఎంకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, కోవూరు, కందుకూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, దగుమాటి కృష్ణారెడ్డి, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజితా వేజండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఘన స్వాగతం పలికారు.

## ఘనంగా వీడ్కోలు..

ఈదగాలి గ్రామంలో వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల అనంతరం సాయంత్రం 4.53 గంటలకు నందగోకులం హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎం హెలీకాప్టర్‌లో విజయవాడకు బయలుదేరివెళ్లారు. సీఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

# సర్వేపల్లిలో కోటి సంతకాల ఉద్యమానికి శ్రీకారం

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైసీపీ పోరాటం ప్రారంభం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితమ్మ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. చంద్రబాబు నాయుడు కాసుల కోసమే ప్రజల ఆస్తులను ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు గురైతే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని విమర్శించారు.




జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. 17 మెడికల్ కళాశాలల్లో 7 పూర్తిగా సిద్ధమై, 5 కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. మిగతా కళాశాలల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రజల ఆస్తులు ప్రజలకే చెందాలి, ప్రైవేట్ వ్యక్తుల కాదని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా 42 రోజులపాటు ఈ ప్రజా ఉద్యమం కొనసాగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. అనంతరం కాకాణి పూజితమ్మ మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, వైద్య విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులు తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ ఆదేశాల మేరకు ఈ కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజల ఆదరణతో ఈ ఉద్యమం విజయవంతమవుతుందని ఆమె పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కూడా ఈ ఉద్యమం ఒక ప్రజా తుఫానుగా మారే అవకాశం ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు.

### మహిళపై సామూహిక అత్యాచారం కేసులో

# ఇద్దరికి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)



తీసివేశారు. 2019వ సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన సామూహిక అత్యాచారం కేసులో సామూహి క అత్యాచారానికి గురైన మహిళ విజయనగరం వాసి. ఆమె శ్రీసిటీలోని ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవారు. ఆమె సూళ్లూరు పేట వనంతోపు సెంటర్లో రూమ్ అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉండేది. ఈ నేపథ్యంలో అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కాకినా డకు చెందిన మాతరాజుతో ఆమెకు పరిచయమైంది. వీరి పరిచయం ఇరువురి నడుమ ప్రేమగా మారింది. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసిమెలిసి ఉండేవారు. ఈ నేపథ్యంలో 2019 సంవత్సరం ఫిబ్రవరి 3న రాత్రి 8 గంటల సమయంలో సూళ్లూరు పేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం చివర వీరిద్దరూ మాట్లాడుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ ప్రియుడు మాతరాజు సమీపంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న నలుగురు నిందితులు మాతరాజుపై దౌర్జన్యం చేసి దాడి చేసి అతని వద్ద పర్సులోని డబ్బులు తీసుకున్నారు. ఇది గమనించిన బాధిత మహిళ రాజుకి మద్దతుగా అక్కడకు వెళ్ళింది. బాధిత మహిళను చూసి రెచ్చిపోయిన నలుగురు నిందితులు.. బలవంతంగా బాధిత మహిళను సమీపంలో ఉన్న ఇసుక దిబ్బల దగ్గరకు తీసుకెళ్లి ఆమెపై అసభ్యంగా, అమానుషంగా, అనాగరికంగా రాత్రంతా సామూహికంగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులు నలుగురు ఆమెను నరకయా తనకు గురి చేసి అదేరోజు తెల్లవారుజామున అక్కంపేట రైల్వేస్టేషన్లో వదిలారు. ఆమె అక్కడి నుంచి చినిగిపోయిన దుస్తులు, గాయాలతో రైలులో సూళ్లూరుపేటకు చేరుకుని, రాత్రి తనపై జరిగిన అత్యాచార సంఘటనలు తన ప్రియుడు మాతరాజుకు తెలిపింది. దీనిపై జరిగిన సంఘటనను పోలీస్‌స్టేషన్లో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసిన సూళ్లూరుపేట పోలీ సులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు సమగ్ర విచారణ అనంతరం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసును అప్పటి సూళ్లూరుపేట సిఐ కిషోర్‌బాబు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఇంచార్జ్ అడిషనల్ పిపి రఫీమాలిక్ వాదించారు.

# ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యంగమే బలమని రిటైర్డ్ ఉపఖజానా అధికారి ఖలీల్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ (న్యూఢిల్లీ) సౌజన్యంతో అమ్మ మహిళా సేవా సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగార్జున స్కూల్లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, బాబా సాహెబ్ అంబేద్కర్, చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం చేశారు. అనంతరం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని పొదలకూరులో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్‌టీఓ ఖలీల్ సాహెబ్, నాగార్జున స్కూల్ చీఫ్ అడ్వైజర్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మి దుర్గా, ఏఎంసీ డైరెక్టర్ పి.ప్రభాకర్ ఆర్యవైశ్య నేతలు డాక్టర్ జే. బ్రహ్మయ్య, పొట్టి సుధాకర్, గుర్రం మీరా మధు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పిస్తూ జాతీయ ఐక్యత, దేశ సమగ్రతకు పెద్దపీ వేస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో రాజ్యాంగ నిర్మాతల సహకారాన్ని



స్మరించుకుంటూ ఈ వేడుకలను రెండేళ్ళ పాటు జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగం అంటే కేవలం వేదికలపై ప్రదర్శించే పుస్తకం కాదని.. అందులోని విషయాలను పూర్తి భక్తితో పాటించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం కేవలం పార్లమెంటులో మాత్రమే జరుపుకునే సెలబ్రేషన్స్ కాదని.. దేశం మొత్తం జరుపుకోవాల్సిన పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ మహిళా సేవా సమాజ్ ప్రెసిడెంట్ సుమతి, సెక్రటరీ అహ్మద్, పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖర్, ఏఓ జీవీఆర్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్లో ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ప్రారంభం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఈదురు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ 10 (ఏ) నావెల్ యూనిట్ ప్రారంభం కావడం జరిగింది. సంబంధిత లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ప్రారంభించారు. స్కూలు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒక తరగతి గదిలో యూనిట్ ప్రారంభించి దాని ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమాండర్ పాల్గొని మాట్లాడారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో చేయడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో మేలు జరుగుతుందని తెలియజేశారు. మొదటి విడతలో ఈ సంవత్సరం 8వ తరగతిలో 25 మంది విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసుకుని శిక్షణ కల్పిస్తామన్నారు. తద్వారా అనేక రంగాల్లో ప్రావిణ్యం పొందే అవకాశం ఉంటుందని కమాండర్ తెలియజేశారు. యూనిఫామ్ కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం 4000 రూపాయలు సాయం చేస్తుందని విద్యార్థి బ్యాంక్ అకౌంట్ లో వేస్తుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మానసిక ఉల్లాసానికి ఆటల పోటీలు కూడా ఉంటాయని తెలియజేశారు. ఉన్నతమైన చదువుల్లో గుర్తింపు ఉంటుందని కమాండర్ తెలిపారు. శిక్షణ పూర్తి అయిన నేపథ్యంలో క్యాడెట్ లకు సర్టిఫికేట్ ప్రధానం చేస్తామని వీటి ద్వారా ఉన్నతమైన చదువుల్లో ప్రత్యేకత ఉంటుందని కమాండర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మన దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వయం సమృద్ధి భారత్ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఏవీఎస్ సూర్యనారాయణ రాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆత్మ నిర్భర్ భారత్ కో కన్వీనర్, కోస్టల్ జోన్ ఇన్‌చార్జ్ డాక్టర్ అశోక్‌రాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వారు మాట్లాడుతూ.. గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్ని రంగాల్లో ఆత్మ నిర్భర్ యొక్క ఆవశ్యకతను స్వయం సమృద్ధి భారత అభియాన్ అనే పేరుతో సెప్టెంబర్ 25 పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి నుండి డిసెంబర్ 25 భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ జయంతి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. స్వదేశీ వస్తువులను

### జిల్లా బీజేపీ అధ్యక్షులు వంశీధర్ రెడ్డి

తయారు చేసుకోవడం, వాటిని ఇతర దేశాలకు పంపడం ద్వారా మన దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. అనంతరం సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ.. స్వతంత్ర సమయంలో స్వదేశీ ఉద్యమం ఎలాగైతే చేశామో అలాగా మనమందరం స్వదేశీ వస్తువులు తయారు చేయడం సొంత టెక్నాలజీని పెంపొందించుకోవడం ఇతర దేశాల మీద ఆధారపడకుండా మన వస్తువులు మనమే తయారు చేసుకోవడం ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేసుకోవడం ద్వారా మన దేశాన్ని అగ్రగామిగా ఉంటుందని తెలియజేశారు. డాక్టర్ అశోక్ రాజు మాట్లాడుతూ మన దేశానికి కావలసిన అన్ని రకాల ఆయుధాలు అంటే బ్రహ్మోస్ లాంటి మిసైల్స్‌ను మనమే తయారు చేసుకుంటున్నాము. అలాగే రాబోయే 25 సంవత్సరాల అమృత కాలంలో రాష్ట్ర ప్రజలందరూ స్వదేశీ వస్తువులు తయారుచేయడం వాటిని ఆదరించడం ద్వారా మన దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్, ఆత్మ నిర్భర్ భారత్ కన్వీనర్ హర్షవర్ధన్, భరత్‌రెడ్డి, హరిగోపాల్ రెడ్డి, సుభాషిణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణి రాజు, గడ్డం విజయకుమార్, మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, కాసా శ్రీనివాసులు, పెంచలయ్య, జిల్లా కార్యదర్శి సృజనా, రత్నం నాయుడు జిల్లా మీడియా ఇన్‌చార్జ్ శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నేడువిద్యుత్తు సరఫరాకు అంతరాయం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్ కో ఏఈ నాగూర్ వలి తెలిపారు. ప్రతి రెండవ శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ నందు అవసరమైన మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

## వ్యాపారుస్తులకు ప్రజలకుజీఎస్టీ 2.0పై అవగాహన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో శుక్రవారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ బ్యాంకు దగ్గర ఉన్న ది హెూల్సేల్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో కావలి పట్టణంలోని వ్యాపారుస్తులకు ప్రజలకు 2.0 జిఎస్టి పై విస్తృతంగా అవగాహన కల్పించిన కావలి సేల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వరప్రసాదరావు. అనంతరం వ్యాపారస్తులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తగ్గించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు, ఈ పద్ధతులను ప్రవేశపెట్టినట్లు వారు తెలిపారు. గతంలో జీఎస్టీలు నాలుగు విధాలుగా ఉండేవని వాటిని రెండు టారిఫ్‌గా విభజించారు. మొదటిది 18శాతం రెండోది 5శాతం పర్సెంట్ జీఎస్టీగా నిర్ణయించును జరిగిందని తెలిపారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులపై మిగతా ఇతర వస్తువులపై గతంలో ఏ విధంగా జిఎస్టి ఉందో ప్రస్తుతం ఏ విధంగా జీఎస్టీ ప్రభుత్వం కల్పించిందో వచ్చిన ఖాతాదారులకు క్షుణ్ణంగా వివరించి మీకు జీఎస్టీ 2.0 వచ్చిన తర్వాత వస్తువులు ధరలు తగ్గాయని, ఖాతాదారులకు తెలపాలని గతంలో ఉన్నప్పుడు ఇప్పుడు ఉన్న తేడాను కూడా వివరించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు సహకరించాలని జాయింట్ జాయింట్ కమిషనర్ క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమానికి కావలి పట్టణ ఆర్యవైశ్య నాయకులు తట వర్తి రమేష్, ఆర్యవైశ్యులు, వ్యాపారస్తులు, ప్రజలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల పట్ల మానవత్వం చూపాలి

### న్యాయమూర్తి వాణి

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** విధివశాత్తూ జన్మతః మానసిక వికలాంగులుగా తయారైన వ్యక్తుల పట్ల మానవత్వం చూపి వారిని ఆదరించాల్సిన అవసరం సమాజం మీద ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి పేర్కొన్నారు శుక్రవారం నాడు ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక అయ్యప్ప గుడి దగ్గర ఉన్న ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ నందు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి పాల్గొన్నారు. ఈ సదస్సులో న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ అక్టోబర్ 10న ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవంగా ప్రకటించారని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు వివరించారు. కొంతమంది దురదృష్ట వశాత్తు మానసిక శారీరక వికలాంగులుగా తయారవుతున్నారని అలాంటి వారికి సమాజం అండగా నిలవాలని వారి పట్ల చులకన భావంతో వ్యవహరించరాదని న్యాయమూర్తి పేర్కొన్నారు. మానసిక వికలాంగులకు సరైన శిక్షణ ఇస్తే వారు మంచి పౌరులుగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని వారికి శిక్షణతో పాటు అవసరమైన మందులు ఇవ్వాలని న్యాయమూర్తి సూచించారు. శారీరక వికలాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలు అందచేస్తే వారు అందరి లాగే పనులు చేసుకుంటూ సమాజంలో ధైర్యంగా జీవించగలుగుతారని న్యాయమూర్తి పేర్కొన్నారు. కొంతమంది ఇటువంటి ఆదరణకు నోచుకోక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై డిప్రెషన్ లోకి వెళు_న్నారని అటువంటి వారిని స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదరించి తగు



చికిత్సలు ప్రారంభిస్తే మళ్ళీ మామూలు మనుషులు అవుతారని న్యాయమూర్తి పేర్కొన్నారు. అయితే తరచుగా ఉండే కొన్ని లక్షణాల వల్ల ముందుగానే మానసిక ఆరోగ్యాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారని న్యాయమూర్తి తెలిపారు. తదుపరి పిల్లల ఆరోగ్య విషయం వాళ్లకు అందుతున్న వైద్య సదుపాయం అక్కడి డాక్టర్స్ ఎంతమంది ఫిజియోథెరపీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు అనంతరం పిల్లలకు బిస్కెట్లను అందజేశారు. మానసిక వికలాంగుల పట్ల మానవత్వం చూపుతూ వారిని అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ట్రస్టు నిర్వాహకులను న్యాయమూర్తి అభినందించారు మానవసేవే మాధవ సేవగా వీరు చేస్తున్న సేవ వెలకట్టలేనిదని న్యాయమూర్తి శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకురాలు సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా మంత్రి నారాయణ

- బాధితులకు మంత్రి నారాయణ సొంత నిధులు అందజేత
- మంత్రికి ధన్యవాదాలు తెలిపిన అగ్ని ప్రమాద బాధితులు
- నెల్లూరు సంతపేట పాత దుస్తుల మార్కెట్ బాధితులకు టీడీపీ శ్రేణుల చేతుల మీదుగా ఆర్థిక సహాయం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నెల్లూరు నగర ప్రజలన్న, నిరుపేదలన్న మంత్రి నారాయణకు ఎనలేని అభిమానం. ఎక్కడ ఉన్న ఏ పనిలో ఉన్న నిరంతరం నెల్లూరు నగర ప్రజల గురించి ఆలోచించే మంచి మనసున్న వ్యక్తి మంత్రి నారాయణ. ఏ కష్టం వచ్చినా తనను నేరుగా సంప్రదించండి అని మంత్రి చెబుతుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల నెల్లూరు సంతపేట పాత దుస్తుల మార్కెట్ సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించి వ్యాపారస్తులకు నష్టం వాటిల్లిందని మంత్రి నారాయణ దృష్టికి టిడిపి శ్రేణులు తీసుకెళ్లారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మంత్రి నారాయణ వెంటనే అధికారులను, టిడిపి శ్రేణులను పంపి పరామర్శించారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో చెప్పిన మాట ప్రకారం సంతపేట పాత దుస్తుల మార్కెట్ అగ్ని ప్రమాద బాధితులకు శుక్రవారం టిడిపి శ్రేణుల చేతుల మీదుగా మంత్రి నారాయణ సొంత నిధులను అందజేయించారు. మార్కెట్లో పూర్తిగా దగ్ధమైన 8 దుకాణాల వారికి 50 వేలు రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న 12 దుకాణాల వారికి 25 వేల రూపాయలు, 30 దుకాణాల వారికి పదివేల రూపాయలు వంతున మంత్రి నారాయణ సొంత నిధుల నుంచి సహాయం అందించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదంతో దుకాణాల రూపు రేఖలు మారిపోయాయి. ఆ దుకాణాలకు మరమత్తులు చేయించి నూతన రంగులు వేయించేందుకు మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ చూపారు. అదేవిధంగా భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని బాధితులకు మంత్రి నారాయణ ధైర్యం చెప్పారు. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి నారాయణకు జేజేలు పలికారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ వెంటే తాముంటామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, 51 క్లస్టర్ ఇన్‌చార్జ్ శశి అధ్యక్షుడు ప్రశాంత్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.ం

# పేదల జీవితాలకు ఆలంబన సూపర్ జీఎస్టీ టు జీరో



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రజా రంజిక పాలన మెరుగుగా అందిస్తున్నారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు పంచాయతీ పరిధి లోని బీసీ కాలనీలో ప్రజలకు జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టీ గురించి సంపూర్ణ వివరాలతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. అంతేకాకుండా వ్యాపార కూడళ్లలో ర్యాలీలు నిర్వహించారు వినియోగ వస్తువులపై ఎంత శాతం జీఎస్టీ తగ్గిందో వివరించారు. జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని నేడు రెండు స్లాబులకు తీసుకురావడం పట్ల వ్యాపారులకు వినియోగదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది తెలిపారు. ప్రతి ఇంటికి జీఎస్టీ ప్రతిఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రధానికి ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారన్నారు. 12శాతం ఉన్న జీఎస్టీ ప్రస్తుతం ఐదు శాతంకు తగ్గించారని తెలిపారు. బియ్యం, ఉప్పు, పాలు, పప్పులు, గుడ్లు తదితర ఆహార వస్తువులపై ఐదు శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా మినహాయించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులు ఉపయోగించే నోటు పుస్తకాలు పెన్నులు స్టేషనరీ ఉత్పత్తులపై జీరో జీఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. సామాన్యులు ఉపయోగించే 83 రకాల వస్తువుల మీద జిఎస్టి తగ్గడం వల్ల ప్రజల జీవనం ప్రమాణాలు మెరుగవుతాయి అన్నారు గతంలో లైఫ్ ఇన్సూరెన్స్ మీద ఉన్న 18శాతం క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధి ఔషధాలపై ఉన్న 12శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించారన్నారు. జీఎస్టీ తొలగించడం వలన ప్రతి కుటుంబానికి 15వేలు ఆదా అవుతుందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంగా కేంద్రం జీఎస్టీ 2.0 ప్రవేశపెట్టగా స్వర్ణాంధ్ర 2047 దిశగా సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని 16 నెలల కూటమిపాలనలో జరిగిన ప్రగతిని వివరించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి సర్పంచ్ నల్లగోండ్ల సృజన మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్ పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి గువ్వల కృష్ణారెడ్డి వనిపెంట వెంకటసుబ్బారెడ్డి కొండపల్లి వెంకటేశ్వర నాయుడు గురజాల వాసు నాయుడు మంచాల శ్రీనివాస్ నాయుడు చేబ్రోలు వసంత కుమార్ తిరుపతి ఆచారి షేక్ ఖాజా మస్తాన్ ఏగినేని శ్రీనివాస నాయుడు ఆరికొండ శ్రీనివాసులు మాధవ ఏడుకొండలు అంకయ్య తనియా తదితరులు ఉన్నారు.

# దాతృత్వాన్ని చాటుకున్న మాలినీ దేవి వైద్యశాల

## పాఠశాల గదుల నిర్మాణానికి ఆర్థిక సహాయం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక క్రిస్టియన్ పేట ఐదో లైన్లో మాలినీ దేవి వైద్యశాల ఇటీవల నిర్మించబడి ఉన్నది చిన్న కుటుంబం చిన్న వైద్యశాల పేరు ప్రఖ్యాతులుగాంచిన వైద్యశాలయితే కాదు అయితే పెద్ద మనసు చేసుకొని విద్యకు తన దాతృత్వాన్ని ప్రకటించడం హర్షించదగ్గ విషయం. కావలి పట్టణంలోని ముసునూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గదులు లేక విద్యార్థులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇక్కడ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దగ్గరికి వెళ్ళగా వారి ఆదేశాల మేరకు మాలిని దేవి వైద్యశాల, వైద్యులైన మాలిని దేవిబి బత్తిన నరేంద్రబాబు ఎలాగైనా విద్యార్థులకు విద్య అందించడంలో ఉన్న సంతోషము ఇంకొకటి లేదనే ఉద్దేశంతో తను చదువుకొని ఉన్నత స్థితిలో ఉండడం కాదని, విద్యార్థులు కూడా చదువుకొని వారి భవిష్యత్తు కూడా రేపు సమాజానికి ఉపయోగపడే విధంగా మాలిని దేవి దంపతులు ఎంత ఖర్చయినప్పటికీ కూడా ఈ పాఠశాలలో గదులు నిర్మిస్తున్నారు. ఉపాధ్యాయులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు అయితే వారికి ఇక ఆనందానికి అవధులు లేవు. పట్టణంలో ఎంతో మంది ధనవంతులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఉన్నప్పటికీ వారు ఎంతో కొంత దాతృత్వానికి అలవాటు పడాలని ఈ విషయం తెలుసుకున్న పట్టణంలోని ప్రజలు ఆ వైద్యశాలకు తనవంతు కూడా సపోర్ట్ చేయాలని చర్చించుకోవడం విశేషం. కాబట్టి ఎంతోమంది పేరు ఉన్న వైద్యులు మేధావులు ఉన్నప్పటికీ కూడా ఇటువంటి మనసు ఈ మాలినిది దేవి వైద్యశాలకే ఆ భాగ్యం అందడం విశేషం. రాబోయే రోజుల్లో తన వైద్యశాల ఇంకా అభివృద్ధి చెందితే ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో చేయనున్నట్లు సమాచారం.

## రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు జరిగే 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని గుండె మడగల గ్రామమునందలి మెయిన్ అంగన్వాడీ కేంద్రం, ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రం చవటపల్లే అంగన్వాడి సెంటర్లో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మజ కుమారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు నెలల నుండి మూడు సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఐసిడిఎస్ అడిషనల్ సిడిపిఓ షర్మిష్ఠ సూపర్వైజర్ తేజస్వినిలు మాట్లాడుతూ.. కుటుంబ నిర్వహణలో పురుషుల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హౌస్ విజిట్ చేసి ఐసీడీఎస్ ద్వారా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాలను ఏ విధంగా వాడాలని దానిపై అవగాహన కల్పించారు. బాలామృతం, బాల సంజీవిని కిడ్స్, గుడ్లు, పాలు, క్రమం తప్పకుండా వాడుతూ ఆరోగ్యకరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాధా శ్రీదేవి ప్రకృతి ఎంఎల్ హెచ్పి నాగమల్లేశ్వరి ఆశా వర్కర్ లక్ష్మీదేవి గర్భవతులు బాలింతలు అంగన్వాడి హెల్పర్లు తదితరులు, పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఊరట



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం సామాన్య ప్రజల జీవితాలలో భారీ ఉపశమనం కలిగిందని ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి జీఎస్టీ అధికారి వరప్రసాదులు తెలిపారు. శుక్రవారం వింజమూరు పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలను సందర్శించి జీఎస్టీ తగ్గింపు రేట్లు అమలవుతున్నాయా లేదా అన్న అంశంపై ఆరా తీశారు. ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం జీఎస్టీ భారాన్ని తగ్గించడం జరిగిందన్నారు ఈ తగ్గింపుతో ప్రజలు కొనుగోలు చేయాలనుకున్న ఎలక్ట్రానిక్ వస్తువు లపై జీఎస్టీ తగ్గడంతో సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ కె.రామారావు దుకాణం యజమానులు తదితరులు ఉన్నారు.

## 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్, రూరల్ పరిధిలోని వెంగళరావు నగర్ సెక్టారు నందు ఎల్ఎన్ పురం 2, ప్రగతి నగర్‌లోని పలు అంగన్వాడీ సెంటర్లను మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి హేనా సుజన్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులకు, బాలింతలకు పలు సూచనలు ఇవ్వడం, ప్రీ స్కూల్ పిల్లలు హాజరు, బరువు రిజిస్టర్‌ని పరిశీలించారు. అనంతరం సేవా సదనం ని సందర్శించడం జరిగింది. అలాగే అక్కడ ఉన్న మహిళల యొక్క సమస్యలను తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిడిపిఓ టి.అరుణ, అంగన్వాడి సూపర్వైజర్ ఏ.రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని..

# మండల పరిషత్, రెవెన్యూ అధికారులు







**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో అధికారులు సమయానికి విధులకు రావాల్సి ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా హాజరవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులకు సమయానికి రావలసింది పోయి మాదే ఆఫీస్ మా ఇష్టం వచ్చిన సమయానికి మేము వెళ్తాం మమ్మల్ని ఎవరేం చేయలేరు అని ఉదయం 11 అవుతున్న ప్రభుత్వ కార్యాలయానికి ఉద్యోగులు రాని సంఘటన శుక్రవారం ఉదయం సైదాపురం మండల కేంద్రంలోని చోటు చేసుకుంది. ఉదయం 11గంటలు అవుతున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండలంలో జాతీయ ఉపాధి జాబ్ కార్డుల అర్జీదారులు ఏం పని జరగాలన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి, మండల రెవెన్యూ కార్యాలయానికి,ప్రజలు వెళ్తుంటారు. కానీ అందులో ఉన్న ఉద్యోగులు 11 అవుతున్న కార్యాలయానికి రాకపోవడంతో వచ్చిన ప్రజలు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు. 11 అవుతున్న కాలి కుర్చీలు దర్శనం ఇవ్వడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలనతోపాటు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సమయపాలన పాటించకుండా పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు అంటే అతిశయోక్తి లేదు. ప్రభుత్వ కార్యాలయమే కదా తమ ఇష్టం వచ్చిన సమయానికి రావచ్చన్న ధీమాతో ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉదయం 11 గంటల సమయం అవుతున్న మండల రెవెన్యూ కార్యాలయం, ప్రజా పరిషత్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయంటే ఈ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో కాలి కుర్చీలను చూస్తే అర్థం అర్థమవుతుంది. ఇప్పటికైనా సమయపాలన పాటించని ఉద్యోగులను గుర్తించి అట్టివారిపై తగిన చర్యలు తీసుకోవాలని కార్యాలయాలకు వచ్చిన మండల ప్రజలు ఇకనైనా ఉన్నత జిల్లాస్థాయి అధికారులు స్పందించి సమయపాలన పాటించని ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# మాదకద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు

**ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు**



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పట్టణంలోని కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, వాటి దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు, ఎస్ఐ ఎస్.ప్రభాకర్ రావు హాజరై విద్యార్థులకు మాదిగ ద్రవ్యాల ముప్పు, చట్టపరమైన చర్యలు, వ్యక్తిగత జీవితంపై వాటి ప్రభావాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల అవగాహన కోసం మాదిగ ద్రవ్యాల దుష్ప్రభావాలను వివరిస్తూ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, చిన్న వీడియో ప్రదర్శించారు. వీటిని చూసిన విద్యార్థులు మొత్తం పదార్థాల వల్ల కలిగే భయానక పరిణామాలను అర్థం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు కేవలం వ్యక్తి శారీరక ఆరోగ్యాన్ని కాదు మానసిక స్థైర్యాన్ని నాశనం చేస్తాయని, ఒక చిన్న అలవాటు జీవితాన్ని చీకటిమయం చేస్తుందని విద్యార్థి దశలోనే స్నేహితుల ఒత్తిడికి లోనవ్వకుండా స్వీయ నియంత్రణతో ముందుకు సాగాలని ఆయన తెలియజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం ఎన్ డీపీఎస్ చట్టం ప్రకారం తీవ్ర నేరమని, అందుకే యువత నేరామార్గంలోకి వెళ్లకుండా జాగ్రత్త పడాలని.. మత్తు కాదు మనోబలం మన మిత్రుడు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల డీన్ సుధారాణి విద్యార్థులలో శారీరక మరియు మానసిక సమతుల్యత ప్రాముఖ్యతను వివరిస్తూ.. విద్యార్థి దశలో శక్తిని సృజనాత్మక దిశగా మలుచుకోవాలని ప్రేరణనిచ్చారు. తదనంతరం నిరుపమ డి-అడిక్షన్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.రవీంద్ర మత్తు వ్యసనాల గురించి బయటపడే మార్గాలు, పునరావాస కేంద్రాల సేవలు, సమాజం పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులు సుమారు 220 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు చివరిగా వారు 'సే నో టు డ్రగ్స్-ఎస్ టూ లైఫ్' అనే నినాదాన్ని గట్టిగా నినాదిస్తూ సమాజానికి మాదకద్రవ్యాల వ్యతిరేకంగా పోరాడే ప్రతిజ్ఞ చేశారు.

# వైసీపీ కార్యకర్తలకు రక్షణగా డిజిటల్ బుక్



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలకు జరిగిన సమావేశంలో వైసీపీ అండగా నిలిచేందుకు కార్యకర్తల రక్షణ కోసం డిజిటల్ బుక్ అనేది తీసుకురావడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అన్యాయ పాలన చేస్తున్నారని, రెడ్‌బుక్ రాజ్యాంగంతో పార్టీ శ్రేణులను వేధింపులకు గురి చేస్తుండడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు.. వారి రక్షణ కోసం డిజిటల్ బుక్ అనేది తీసుకు వచ్చింది. దానికితోడు క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించింది. డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేస్తే పార్టీ అధిష్టానం కార్యకర్తలకు రక్షణగా నిలవనుందని వైయస్సార్సీపి మండల నాయకుడు మన్నారపు రవికుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తల కోసం డిజిటల్ బుక్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకు వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కార్యకర్తకి, సామాన్య ప్రజలకు ఏ అన్యాయం జరిగినా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరు అయితే నమోదు చేసుకున్నారో వారికి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తారని మండల వైసీపీ కార్యకర్తలకు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్ తెలిపారు. ఈ మండలం నాయకులు గోగినేని శివకుమార్, కంభం విజయభాస్కర్, రాంగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రాజు, వరప్రసాద్ రాజు, దయాకర్ రెడ్డి, మాల్కొండ రెడ్డి, రాజశేఖర్ నాయుడు, కొండాపు మోహన్ రావు, మల్లారపు పెంచలయ్య, కుంచం ఈశ్వరయ్య, బోలిగర్ల శివకుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై వ్యాసరచన పోటీలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు వెంకటాచలం మండలంలో కనుపూరు సచివాలయం పరిధిలోని జడ్పీహెచ్ఎస్ కనుపూరు పాఠశాలలో బాల్యవివాహాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వి.విజయలక్ష్మి ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిహెచ్ వి.భాగ్యలక్ష్మి, జి.సీతామాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు భద్రమ్మ, వసంతకుమారి, పరమేశ్వరి, అలాగే జడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని, బాలికలు విద్యతో ముందుకు సాగి స్వయం సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు జరిగే 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఏఎస్ పేట సెక్టార్ 1, 2, 3, 4, అంగన్వాడి సెంటర్లో ఐసీడీఎస్ సీడీపీఓ పి.సునీలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు నెలల నుండి మూడు సంవత్సరాలు నిండిన పిల్లల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. కుటుంబ నిర్వహణలో పురుషుల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా హౌస్ విజిట్ చేసి ఐసీడీఎస్ ద్వారా పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాలను ఏ విధంగా వాడాలని దానిపై అవగాహన కల్పించారు. బాలామృతం, బాల సంజీవిని కిడ్స్, గుడ్లు, పాలు, క్రమం తప్పకుండా వాడుతూ ఆరోగ్యకరంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుశీల, సావిత్రి, షాకిర, కృష్ణకుమారి, ఇందిరా అంగన్వాడి హెల్పర్లు, పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నెల్లూరు లోని రూరల్ మండలం, కొత్తూరులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మంచి విద్య వల్ల మానసిక స్థిరత్వం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సింగనమల సుధారాణి నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడుతూ.. పిల్లలు శరీరాన్ని ఎలా కాపాడుకుంటారో మనస్సును కూడా అలానే సంరక్షించుకోవాలి అని తెలిపారు. కావునా పిల్లలు మానసికంగాను, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం, నిద్ర, సమతుల్య ఆహారం చాలా ముఖ్యం అని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.ప్రభావతి, మండల ఎంఈఓ హరిబాబు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, పిల్లల్లో సానుకూల ఆలోచనలు పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం దోహదపడిందని పాఠశాల సిబ్బంది అభిప్రాయపడ్డారు.

# బాలికల సంరక్షణకు బోలెడు పథకాలు, చట్టాలు : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బాలికల సంరక్షణకు, సంక్షేమానికి, విద్య, వైద్యానికి ప్రభుత్వాలు బోలెడు పథకాలను, చట్టాలను అమలుచేస్తుందని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపిఓ పి.సునీలత పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికాదినోత్సవంను పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలోని జెడ్పి బాలికోన్నత పాఠశాలవద్ద ప్రత్యేక అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. బాలికలు విద్య, వైద్యం పొందేందుకు, సంరక్షణకు పలు సంక్షేమపథకాలు అమలులో ఉన్నాయని, వారి రక్షణకు, న్యాయం పొందేందుకు అనేక చట్టాలు అమలులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. సమాజంలో బాలికల సామాజిక ఎదుగుదల గురించి ఆమె వివరించి అందరికీ అవగాహన కల్పించారు. ఆడపిల్లల సాధికారత, పోషణ దృక్పథాన్ని గౌరవించడానికి బాలికాదినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నేటి సమాజంలో బాలికలు పోషించే కీలకపాత్రను ఈ దినోత్సవం గుర్తుచేస్తుందన్నారు. బాలికలకు విద్య,వైద్యం, సంక్షేమం, రక్షణ పొందే హక్కులున్నాయని, వారికి ఎలాంటి అన్యాయం జరిగినా సత్వర న్యాయం కోసం పలు చట్టాలున్నాయని, బేటీబచావో బేటీపడావో లాంటి అనేక పథకాలు అమలులో ఉన్నాయని ఆమె తెలిపారు. బాల్యవివాహాలు అత్యంత అనర్థదాయకమని, బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ,అందుకు ప్రత్యేక చట్టాలున్నాయని సునీలత పేర్కొన్నారు. బాలికాసాధికారత లక్ష్యంగా ఆదిశగా ప్రభుత్వ పథకాలను, చట్టాలను వినియోగించుకోవాలని, అందరూ అభివృద్ధి చెందాలని సునీలత కోరారు. సిడిపివో సునీలత ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

### జోహో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతోంది..

# స్వదేశీ సత్తా ప్రపంచానికి చెమట్లు!



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** స్వదేశీ సత్తా ప్రపంచానికి ఎలా చెమట్లు పట్టిస్తోంది అన్నది. ఒకప్పుడు అమెరికా భారత్‌ను ఆంక్షలతో భయ పెట్టాలని చూస్తే, ఇప్పుడు అదే అమెరికా భారత్ పరిచయం చేస్తున్న భయాన్ని అనుభవిస్తోంది. మోదీ సర్కార్ 'తగ్గేదేలే' అంటుంటే, జోహో వంటి భారతీయ సంస్థలు అమెరికా టెక్ దిగ్గజాలకు నిజంగా గట్టిపోటి ఇస్తున్నాయనీ చిలక డిజిటల్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ చిలకా ప్రవీణ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రం సపోర్ట్‌తో జోహో ఇప్పుడు జెట్ స్పీడ్‌లో దూసుకుపోతోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు మన మార్కెట్‌లో ఏకాధిపత్యం చూపించిన రోజులు నెమ్మదిగా ముగియబోతున్నాయి. దేశం మొత్తం ఇప్పుడు చెప్పుకుంటున్న మాట 'జోహోతో అమెరికా టెక్ దిగ్గజాలకు చెమట్లు!' ప్రధాని మోదీ గారి 'వోకల్ ఫర్ లోకల్', 'ఆత్మనిర్భర్ భారత్' పిలుపు కేవలం నినాదం కాదు అది ఇప్పుడు రియాలిటీగా మారింది. స్వదేశీ టెక్నాలజీ, స్వదేశీ ఆలోచన, స్వదేశీ ఉత్పత్తులు.. ఇవే భవిష్యత్తు దిశ. జోహో సంస్థ హిస్టరీ చూస్తే మనందరికీ గర్వం కలగాలి అన్నారు. ఈరోజు ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో 10 కోట్ల మంది యూజర్లతో జోహో నిలబడింది. జోహోలో ఈమెయిల్, అకౌంటింగ్, హెచ్‌ఆర్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సిఆర్‌ఎమ్ వంటి 55కి పైగా క్లౌడ్ ఆధారిత టూల్స్ ఉన్నాయి. వీటితో వ్యాపారాలు మరింత స్వతంత్రంగా, సురక్షితంగా ఎదుగుతున్నాయి. మైక్రోసాఫ్ట్ లేదా గూగుల్‌తో పోలిస్తే జోహో సర్వీసులు తక్కువ ధరలో, అధిక సెక్యూరిటీతో అందుబాటులో ఉన్నాయి. డేటా ప్రైవసీకి ప్రాధాన్యత, యాడ్ ఫ్రీ ఇంటర్‌ఫేస్. ఇవే జోహో ప్రత్యేకతలు. గూగుల్ జిమెయిల్‌కి ప్రత్యామ్నాయంగా జోహో మెయిల్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌కి ప్రత్యామ్నాయంగా జోహో వర్క్‌స్పేస్ ఇప్పుడు వేగంగా ప్రజాదరణ పొందుతున్నాయి. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, అమిత్ షా జోహో మెయిల్, టూల్స్ ఉపయోగించడం ప్రారంభించడంతో ఈ ఉద్యమం మరింత బలపడిందన్నారు. ఇదే సమయంలో జోహో రూపొందించిన 'అరట్టై' యాప్ కూడా దుమ్మురేపుతోంది. అరట్టై తమిళంలో 'క్యాజువల్ చాట్' అని అర్థం. ఇది 2021లోనే లాంచ్ అయినప్పటికీ, ఇప్పుడు వాట్సాప్‌కు నిజమైన ప్రత్యామ్నాయం అయింది. అరట్టైలో వన్ టు వన్ చాట్, గ్రూప్ చాట్, వీడియో షేర్, వాయిస్ నోట్, స్టోరీస్, బ్రాడ్‌కాస్ట్ చానల్స్ అన్నీ ఉన్నాయి. ఇది క్లియర్, స్పైవేర్ ఫ్రీ, ప్రైవసీ ఫ్రెండ్లీ యాప్. ఇంతవరకు ప్లే స్టోర్‌లో కోటి డౌన్‌లోడ్స్ దాటింది, 4.8 రేటింగ్‌తో అగ్రస్థానంలో ఉంది. ఈ యాప్ గ్రోత్ చూసి టెక్ ఎక్స్పర్ట్స్ కూడా షాక్ అవుతున్నారు. స్వదేశీ టెక్నాలజీపై మోదీ సర్కార్ ప్రోత్సాహం, సోషల్ మీడియా బజ్ కలిసిపోవడంతో ఇది కొత్త చరిత్ర సృష్టిస్తోంది. అదే సమయంలో జోహో పేమెంట్స్ కూడా విస్తరిస్తోంది. డెబిట్, క్రెడిట్ కార్డు, క్యూ ఆర్ కోడ్ చెల్లింపులు, పిఓఎస్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అంటే ఇప్పుడు జోహో పూర్తి ఎకోసిస్టమ్‌గా ఎదుగుతోంది. విదేశీ సంస్థలపై ఆధారపడటం వల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థ నుంచి డబ్బు బయటికి పోతుంది, మన డేటా కూడా బయట దేశాల సర్వర్లలోకి వెళ్తుంది. ఈ పరిస్థితికి ఎండ్ చెప్పేది స్వదేశీ యాప్‌లు, స్వదేశీ సాఫ్ట్‌వేర్‌లు మాత్రమే. చైనా యాప్‌లను బ్యాన్ చేసినప్పుడు మనకు ప్రత్యామ్నాయాలు తక్కువగా ఉండేవి. ఇప్పుడు జోహో, అరట్టై వంటి ఆవిష్కరణలు భారత్‌ను సైబర్ స్వావలంబన వైపు తీసుకెళ్తున్నాయి. మన దేశంలో ఉన్న టాలెంట్ ప్రపంచంలో ఎక్కడా లేదు. అదే టాలెంట్‌ను మన దేశ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే భారత్ టెక్నాలజీ లీడర్‌గా అవుతుందన్నారు .మనం మన యాప్‌లు వాడాలి, మన సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి చేయాలి, మన డేటా మన చేతుల్లో ఉండాలి. ఇదే నిజమైన డిజిటల్ స్వాతంత్ర్యం. జోహో, అరట్టై విజయాలు చూపుతున్నాయి. భారత్ ఇప్పుడు ఎవరి కిందా కాదు, తన సత్తా ప్రపంచానికి నిరూపిస్తున్న దేశం. ఇదే భారత టెక్ విప్లవం. ఇదే స్వదేశీ గర్వం. ఇదే భవిష్యత్తు దిశ అన్నారు.

## ఎస్‌జీఎఫ్ ఆటల్లో సత్తా చాటిన 'నాగార్జున' విద్యార్థులు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో మండల స్థాయిలో పట్టణంలోని నాగార్జున స్కూల్ క్రీడాకారులు ప్రతిభ చూపించి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గ, ఏఓ జివిఆర్ తెలిపారు. ఈవెంట్స్‌లో 800 మీటర్స్‌లో నిఖిత మండల ద్వితీయ స్థానం సాధించగా, అండర్ 14 కబడ్డీలో ప్రణవ సందీప్ మొదటి స్థానంలో నిలిచారు. అండర్ 17 బాయ్స్ షటిల్ బ్యాట్మెంటన్ డబుల్ విన్నర్స్‌గా అన్వేష్, శ్రీనివాసులు నిలిచారు. అలాగే సింగిల్స్ విభాగంలో అన్వేష్, షాట్ పుట్, 200మీటర్స్ రన్నింగ్‌లో ఖదీర్ మొదటి స్థానాన్ని సాధించారు. డిస్క్ త్రోలో ధనుష్ ఎంపికయ్యారు. అండర్ 17 గర్ల్స్ అభినందించారు. డిస్క్ త్రోలో ప్రశక్షణ మొదటి స్థానంలో నిలిచింది. అండర్ 14 గర్ల్స్ షటిల్ బ్యాట్మెంటన్‌లో యశస్విని మొదటి స్థానంలో నిలువగా, అండర్ 17 వాలీబాల్‌లో అన్వేష్, కబడ్డీలో ఎస్కె ఖదీర్ శ్రీనివాసులు ఎంపికయ్యారు. అండర్ 14 బాయ్స్ లాంగ్ జంప్ లో ప్రణయ్, గర్ల్స్ కబడ్డీలో ఐదుగురు సెలెక్ట్ అయ్యారు. ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చూపిన ఈ క్రీడాకారులను పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చీఫ్ అడ్వైజర్ సుబ్బారావు, డైరెక్టర్ ఏ.చంద్రశేఖర్ అభినందించారు.

## చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పొదలకూరు పట్టణంలోని సంగం రహదారిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొదలకూరు మండలంలోని నేదురుమల్లి గ్రామానికి చెందిన సుధాకర్ నాయుడు (55) అనే వ్యక్తి భార్య, పిల్లలను వదిలేసి నెల్లూరులో కాపురం ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పూటుగా మద్యం సేవించి చేతిలో తాడు పట్టుకొని సంగం రహదారిలో తిరుగుతుండగా స్థానికులు గుర్తించారు. తాగిన మైకంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు బావిస్తున్నారు. కాగా భార్య కాపురానికి రాలేదనే మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి అక్కడ చెట్టుకు వేలాడదీశారా అన్న కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పొదలకూరు ఎస్ఐ షేక్ మహమ్మద్ హనీఫ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యం పౌష్టికాహారంతో సాధ్యం : సూపర్‌వైజర్ కస్తూరి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తల్లీబిడ్డలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే తప్పకుండా గర్భిణీలు, బాలింతలు తగినంతగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కస్తూరి పేర్కొన్నారు. రాష్ట్రీయపోషణ్‌మా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ కస్తూరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ కస్తూరి ప్రసంగిస్తూ నెలరోజులపాటు ఊరూవాడా ముమ్మరంగా పౌష్టికాహారం, తల్లీ,బిడ్డల ఆరోగ్యం గురించి అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సదస్సులకు సార్థకతచేకూరేలా గర్భిణీలు, బాలింతలు, మహిళలు పౌష్టికాహారం ఆవశ్యకత గురించి, తద్వారా లభించే ప్రయోజనాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని, తదనుగుణంగా పాటించాలని ఆమె సూచించారు. గర్భిణీలు,బాలింతలు, పుట్టే బిడ్డలు రక్తహీనతకు గురికుండేలా, ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం స్త్రీ,శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వివిధ రకాల పౌష్టికాహారంను అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ పౌష్టికాహారాన్ని లబ్దిదారులే తప్పకుండా వినియోగంచుకోవాలని, ప్రభుత్వ సంక్షేమపథకాల ఫలాలు పొందాలని కస్తూరి సూచించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన పౌష్టికాహార పధార్థాలను పరిశీలించిన కస్తూరి వాటిని గురించి పాల్గొన్న మహిళలందరికీ అవగాహన



పెంపొందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.విజయమ్మ, శాంతమ్మ, నిరోషా, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై ఉద్యోగుల అసంతృప్తి స్వరాలు

- ఉద్యమ కార్యాచరణలు
- కొనసాగుతున్న వైద్యాధికారుల సమ్మె
- ఉపాధ్యాయుల సహాయనిరాకరణ
- యాప్‌లనుండి వైదొలిగిన సచివాలయ సిబ్బంది
- వీఆర్‌ఏల ఛలోవిజయవాడ
- అంగన్‌వాడీల్లో అసంతృప్తి




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల్లో అసంతృప్తి ఆరంభమైంది. ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. వేతనాలు పెంచలేదని అంగన్‌వాడీలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. వారు తయవద్ద ఉన్న మొబైల్‌ఫోన్లను ఒకటిన్నరనెలక్రితమే వాపసు చేశారు. సచివాలయ సిబ్బంది తమ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ యాప్‌లనుండి వైదొలిగారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ప్యాప్టో) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఇటీవల ధర్నాలు నిర్వహించి 3రోజులక్రితం ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి అక్కడ ధర్నా చేయడంతోపాటు శుక్రవారం నుండి యాప్‌లను బహిష్కరించారు. గ్రామ రెవిన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) ఆందోళనకు పూనుకున్నారు. ఈనెల 13, 14వ తేదీల్లో ఛలో విజయవాడ, ధర్నాకు నిర్ణయించారు. ఆందోళనలకు, ఉద్యమాలకు నాందిగా వారు చెబుతున్నారు. ఈ ఆందోళనలతో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే కార్యాచరణ రూపొందిస్తామని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలుచేస్తారని 16నెలలుగా నిరీక్షించామని, అయినా ఫలితం లేనందున ఆందోళన అనివార్యమైందని, ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

## సమ్మెలో ప్రభుత్వవైద్యాధికారులు

రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా ఆత్మకూరు ప్రాంతంలో ప్రభుత్వ వైద్యాధికారులు గతనెల 26వ తేదీ నుండి సమ్మెలో ఉండగా ఇతర ప్రాంతాల్లో వైద్యాధికారులు విధులు నిర్వహించడం లేదని తెలిసినా ఈప్రాంతంలో మాత్రం వైద్యాధికారులు మానవతాధృక్పధంతో నల్లబ్యాడ్జిలు ధరించి విధులు నిర్వహిస్తున్నారు. పలు సమస్యలు పరిష్కారం కోరుతూ న్యాయమైన తమ కోర్కెలను ప్రభుత్వం ఆమోదించాలంటూ వారు సమ్మెకు దిగారు. తమ నిరసనలో భాగంగా వైద్యాధికారులు ఈనెల3వతేదీన ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి అక్కడ ధర్నా, మానవహారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారులకు పి.జి కోర్సు అభ్యశించేందుకు 30శాతం అవకాశం ఉండగా ప్రభుత్వం తగ్గించిందని, గత ప్రభుత్వం 30నుండి 15శాతంకు కుదించగా అప్పట్లో తామంతా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించడంతో 20శాతంగా నిర్ణయించారని, కానీ నేటి ప్రభుత్వం మళ్ళీ ఆసంఖ్యను 20శాతంనుండి 15శాతంకు తగ్గించిందని, దాంతో తమకు ఉద్యమం అనివార్యమైందని వైద్యాధికారులు చెబుతున్నారు. నిర్ణీతకాల పరిమితిలో తమకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉందని, 8సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకున్న వారికి డిప్యుటి సివిల్‌సర్జన్‌గా, 12సంవత్సరాలు పూర్తిచేసైఉకున్నవారికి సివిల్ సర్జన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలి ఉన్నా ప్రభుత్వం ఆవిధంగా అమలుచేయడం లేదన్నారు. డిఏ బకాయిలు 5విడతలుగా చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో వైద్యాధికారికి దాదాపు 2లక్షల రూపాయలు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. వైద్యసేవలు అత్యసరసేవలు కాగా వైద్యాధికారులగురించి ప్రభుత్వం పట్టించుకొనకుండా నిర్లక్ష్యం చేయడం విచారకరంగా ఉందంటున్నారు. తమ డిమాండ్ల సాధనకుగాను సమ్మెకు దిగామని వైద్యాధికారులు చెబుతున్నారు.

## ఉద్యమానికి సిద్ధమవుతున్న సచివాలయాల సిబ్బంది

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తమ కోర్కెల సాధనకు ఉద్యమానికి సిద్ధమయ్యారు. ప్రధమంగా 10 రోజులక్రితం వారంతా అధికారిక వాట్స్‌యాప్ గ్రూపుల నుండి వైదొలిగారు. తదుపరి అడుగు ఎలా వేయాలనే యోచనలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈకార్యక్రమం జరుగుతుండగా ఆత్మకూరు ప్రాంతంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పూర్తిగా అధికార గ్రూపులనుండి వైదొలిగారు. వారు ప్రతిరోజూ తమ సచివాలయాలకు హాజరవుతున్నా విధులు నిర్వహించకుండా సహాయనిరాకరణలాగా వ్యవహరిస్తున్నారు. తమ ఆత్మగౌరవం దెబ్బతినేలాగా ఇంటింటికి తిరిగి సేవలందించే పరిస్థితినుండి తమను తప్పించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని చెబుతున్నారు. ఏపివిడబ్ల్యుఎస్‌యి రాష్ట్ర కార్యవర్గ పిలుపుమేరకు తాము అధికారయాప్‌లనుండి వైదొలుగుతున్నామని వారు సంబంధిత ఎండివోలకు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తమను నిర్ణయించాక ఎలాంటి విధులు అప్పగించినా చేస్తామని, అయితే ఇంటింటా పెన్షన్ల పంపిణీ, సర్వేలకు వినియోగించరాదని వారు చెబుతున్నారు. తాము యాప్స్‌నుండి వైదొలిగినా కార్యాలయంలో ఉదయం10.30నుండి సాయంత్రం 5గంటలవరకు అందుబాటులో ఉంటామని వారు చెబుతున్నారు. వాలెంటరీ విధులుగా ఉండే ఇంటింటా సర్వేలనుండి తమకు విముక్తి కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ప్రొబేషనరి సమయంలో రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆరుసంవత్సరాలు ఒకే పోస్టులో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, ఏఏ శాఖల ఉద్యోగులను ఆయా మాతృసంస్థల్లో విలీనం చేయాలని, అర్హతకు తగిన ప్రమోషన్ చానెల్ ఏర్పాటు చేసి సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## యాప్‌లను బహిష్కరించిన ఉపాధ్యాయులు

ఎన్నికల సమయంలో కూటమినేతలు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయనందున ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనలకు, ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఆత్మకూరులో ధర్నా నిర్వహించి ఈనెల 7వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘాల సమాఖ్య(ప్యాప్టో) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా కు తరలివెళ్ళారు. ఈనెల10వతేదీ శుక్రవారం నుండి ప్రభుత్వ యాప్‌లను బహిష్కరించారు. ఉపాధ్యాయులకు బోధనేతరపనులు నుండి విముక్తి కల్పించాలని, 12వ పిఆర్‌సి నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధన, పెండింగ్ బకాయిలు చెల్లింపు తదితర డిమాండ్ల సాధనకోసం వియవాడలోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించామని, రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కానీ ఈ ప్రభుత్వం ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని వారు చెబతున్నారు. పెండింగ్‌లో ఉన్న వేలకోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, బదిలీ పొంది రిలీవ్‌కాని వారిని వెంటనే రిలీవ్‌చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమినేతలు హామీలివ్వగా అందరం ఎంతగానో ఆశపడ్డామని, తీరా చూస్తే ఒక్క సమస్యకూడా పరిష్కారం కానందున తీవ్ర ఆవేదనతో ఉన్నామని వారంతా చెబుతున్నారు. తాము యాప్‌లను బహిష్కరించామని, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు చెబుతున్నారు.

## అసంతృప్తితో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తలు, సమాయకులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వారు అనేక ఆందోళనలు చేయడంతోపాటు 42రోజులపాటు నిరవధికసమ్మె సాగించారు. తమకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇంకా వివిద సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు. పూర్తిసమయం కేటాయించి విధులు నిర్వహిస్తున్న తమకు కనీసవేతనం 26వేలరూపాయలుగా చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారు. కానీ గత ప్రభుత్వం వేతనాలు పెంచకుండా తూతూమంత్రపు హామీలతో కాలం గడిపారు. 42రోజుల సమ్మె సమయంలో తెలుగుదేశం నాయకులు వారికి పలు హామీలిచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక జీతాలు పెంచుతామని హామీలిచ్చారు. వారంతా ఎంతో ఆశపడ్డారు. కాగా కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల ఏవో కొన్ని ప్రయోజనాలు కల్పిసైఉత్తన్నామంటూ జీతాలు మాత్రం పెంచలేదని వారంతా అసంతృప్తిగా ఉన్నారు.

## 13న వీఆర్‌ఏల ఛలోవిజయవాడ

గ్రామరెవిన్యూ సహాయకులు తమ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించడంలేదంటూ ఆందోళనకు సిద్దమవుతున్నారు. అందులోభాగంగా ఈనెల 13, 14వ తేదీల్లో ఛలో విజయవాడ కార్యక్రమంకు పిలుపునిచ్చారు. అక్కడ మహాధర్నా నిర్వహించతలపెట్టారు. తమకు గత ప్రభుత్వం వేతనాలు పెంచకపోగా ఉన్నటువంటి డిఏలను కూడా రద్దు చేశారని వారు చెబుతున్నారు. 2018లో తమ వేతనాలు 6500 రూపాయలనుండి 10500 రూపాయలకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచారన్నారు. ఈనాటికీ అదే జీతాలతో కొనసాగుతున్నామని, ఎనిమిదేళ్ల నుండి పనిభారం పెంచుతున్నారే తప్ప జీతాలు పెంచడం లేదంటున్నారు. తాము పూర్తి సమయం కేటాయించి విధులు నిర్వహిస్తున్నామని, అదనపు విధులు కూడా అప్పగిస్తున్నారని చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు తమకు పలు హామీలిచ్చారని, అయినా నేటివరకు అమటుకునోచుకోలేదని వారు చెబుతున్నారు. తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, ప్రయోషన్లు కల్పించాలని, జీతాలు పెంచాలని, మహిళా విఆర్‌ఏలకు 180రోజుల ప్రసూతిసెలవులను రెండు కాన్పులకు వర్తింపజేయాలని తదితర డిమాండ్ల సాధనకు తాము ఆందోళనకు దిగుతున్నామని, అందులోభాగంగా ఈనెల 13, 14వ తేదీల్లో విజయవాడలో ధర్నా నిర్వహిస్తామని వారు చెబుతున్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక వర్గాల్లో ఇపుడిపుడే అసంతృప్తి స్వరాలు, ఆందోళనబాటలు ఆరంభమయ్యాయి. మరి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని కాపాడాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో అందరూ విరివిగా మొక్కలు నాటాలని, వాటిని పెంచాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఆత్మకూరు ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.హెప్సిబా పిలుపునిచ్చారు. విజిలెన్స్‌అవగాహనా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యలయంలో మున్సిపల్ కమీషనర్ సి.గంగా ప్రసాద్ సహకారంతో మొక్కలునాటే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విరివిగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలవారు బాధ్యతాయుతంగా స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని, వాటిని పెంచి పోషించాలని కోరారు. చెట్లు అధికంగా లేనందున వాతావరణ సమతుల్యత లేదని, పర్యావరణం దెబ్బతింటుందని, మొక్కలు అధికంగా నాటిపెంచితే పచ్చదనంగా ఉండడం, ఆహ్లాద భరితంగా ఉండడంతో పాటు వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందని, సకాలంలో వర్షాలు కురుస్తాయని, పర్యావరణం పరిరక్షించబడుతుందని హెప్సిబా పేర్కొన్నారు. అవకాశం ఉన్నచోట్లంతా అందరూ తమవంతుగా మొక్కలు నాటి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ జి.కిరణ్‌కుమార్, మెప్మా సీఓ జి.మాధవి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పలు చోట్ల విద్యుత్ అంతరాయం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో రెండవ శనివారం ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏర్పడుతుందని సైదాపురం మండలంలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు, 33 కెవి లైన్ కింద చెట్లను, తీగలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేయడం ద్వారా మండల ప్రజలకు కొంతమేర విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని మండల ప్రజలు అందరు కూడా సహకరించాలని సైదాపురం మండల ప్రజలకు మండల విద్యుత్ శాఖ అధికారి నాగభూషణ్ నాయక్ తెలిపారు.

# సర్వేపల్లిలో సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం





**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులతో కలిసి సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. తరువాత వెంకటాచలం మండలం ఈదగాలి, సర్వేపల్లి పరిధిలో ఏర్పాటు చేసిన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్, నందగోకులం లైఫ్ స్కూల్, నందగోకులం సేవ్ ద బుల్ కాజ్ ప్రాజెక్ట్‌లను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. అదే దిశగా ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెడతాం అన్నారు. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఇథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఉత్పత్తి చేస్తోందని, పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాలను కొనుగోలు చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతోందని సీఎం తెలిపారు. పశుసంపద పరిరక్షణలో భాగంగా ఎద్దులతో ట్రెడ్‌మిల్ మిషన్‌పై వ్యాయామం చేయించి విద్యుత్ ఉత్పత్తి చేసే వినూత్న ప్రయోగం అభినందనీయమని పేర్కొన్నారు. నందగోకులం లైఫ్ స్కూల్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తున్న చింతాశశిధర్ ఫౌండేషన్ సేవలను సీఎం ప్రశంసించారు. సమాజానికి తిరిగి ఇవ్వాలనే ధోరణి పీ4, జీరో పావర్టీ లక్ష్య సాధనకు ఆదర్శమని తెలిపారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి పరుగులు తీస్తోందని సీఎం పేర్కొన్నారు. సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో 150 టీఎంసీల నీటి నిల్వ ఉందని, కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా ఆర్థికాభివృద్ధికి దన్నుగా మారనున్నాయని అన్నారు. దగదర్తి విమానాశ్రయం త్వరలో ప్రారంభమవుతుందని, బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌లు నెల్లూరు రూపురేఖలు మార్చనున్నాయని తెలిపారు. అదే సమయంలో, విశాఖలో రూ.88వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతోనే రాష్ట్ర అభివృద్ధి

### జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో సీఎంకు ఘనసత్కారం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. జిల్లా పర్యటన భాగంగా శుక్రవారం సీఎం చంద్రబాబు సర్వేపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్ చంద్రబాబుకి కిరీటం తొడిగి కత్తిని బహుకరించారు. ఈ సందర్భంగా నూనె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చంద్రబాబు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎనలేని కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి నాయకుడు సమాజంలో అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, వారి ఆశీస్సులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ఎల్లవేళలా ఉండాలని కోరారు. టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ జిల్లా అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, జిల్లాకు రావలసిన నిధులు రాబట్టడంలో, టిడ్కో గృహాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. సందర్భంగా ఆయన సేవలను సీఎంకు వివరించారు. కార్యక్రమంలో చిముకుల శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు గురించి అవగాహన ఉండాలి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన ఉండి ఉపయోగించుకోవాలని శుక్రవారం నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామంలో నోకియా, రీచా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ప్రాజెక్టు సూపర్వైజర్ యం రమణయ్య మాట్లాడుతూ.. జాతీయ కుటుంబ ప్రయోజనాల పథకం గురించి తెలియజేశారు. అలాగే ఎన్ఎఫ్‌బీఎఫ్ సంబంధించి 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య కుటుంబ పెద్ద మరణించిన తరువాత కుటుంబ పోషించే బాధ్యత మహిళదే కావున ఈ పథకం కింద 20వేల రూపాయలు పొందవచ్చు. అలాగే చనిపోయిన వ్యక్తి 12-04-2017 సంవత్సరం తరువాత చనిపోయి ఉండాలి వారికి సంవత్సరాల ఆదాయం 60వేల లోపు ఉండాలి ఇంతకుముందు ఆపద్బాంధు పథకం కింద ప్రయోజనం పొంది ఉండరాదు అని తెలియజేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం గురించి వివరిస్తూ.. పిల్లల యొక్క విద్యకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలియజేశారు. గరిష్టంగా ఇద్దరు పిల్లలు చదువుకునేందుకు పదివేల నుండి లక్ష రూపాయలు వరకు రుణం సాయం అందించడం జరుగుతుంది. ఈ రుణానికి నాలుగు శాతం వడ్డీ చెల్లించవలసి ఉంటుంది. అయితే పిల్లలు యొక్క తల్లులు స్వయం సహాయక సంఘంలో సభ్యులు గా ఆరు నెలల కాలం గడిచి ఉండాలని తెలియజేశారు. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మొబలైసర్ ఏ.శివ, కంప్యూటర్ అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ బి.అంజయ్య, సెంటర్ ఫెసిలిటేటర్స్ షైక్ ఖాదర్ బాష, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డిని అభినందించిన సీఎం చంద్రబాబు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా వెంకటాచలంలోని ఈదగాలిలో బయోఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబును వేదికపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరిగిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ సరఫరా, విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఏర్పాటుకు 43కోట్ల రూపాయలతో జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వివరించారు. ఈ నెలాఖరు లోపల ఈ పనులు పూర్తవుతాయని దీనివల్ల రూరల్ నియోజకవర్గం 80వేలమందికి పైగా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుక్‌లెట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. దీనికి చంద్రన్న విద్యుత్ వెలుగులుగా నామకరణ చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యేకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు.

## వీఎస్‌యూలో క్రీడా పోటీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉమెన్ గేమ్స్ కబడి బాస్కెట్బాల్, బ్యాట్మెంటన్ సింగిల్ డబుల్ కాలేజీ నందు నిర్వహించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ వెంకట్రాములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 13 కళాశాల నుండి సుమారు 200మంది మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ విన్నర్‌గా శ్రీసాయి, రన్నర్గా జవహర్ భారతి కళాశాల, షటిల్ బ్యాట్మెంటన్ సింగిల్స్ విన్నర్గా జెనెక్స్ నెల్లూరు, రన్నర్‌గా జవహర్ భారతి కళాశాల గెలుపు పొందినారు. గెలుపు పొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ చేవూరు మణికంఠ, అబ్జర్వర్ డాక్టర్ విజయ కళ, వివిధ కళాశాల పీడీలు డైరెక్టర్స్ పాల్గొన్నారు.

## హెలిప్యాడ్ ప్రాంగణంలో మౌలిక వసతులు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా పర్యటన పురస్కరించుకొని వెంకటాచలం మండలం నందన విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్లాంట్ లిమిటెడ్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నిర్వహణ విధులను నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ శుక్రవారం నిర్వహించారు. వివిఐపీలకు హెలిపాడ్ వద్ద పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ప్రోటోకాల్ నిర్వహణలో సీఎం ఓ కార్యాలయం నిర్దేశించిన వ్యక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం. హెలిపాడ్ ప్రాంగణంలో అన్ని రకాల మౌలిక వసతులు, బయో టాయిలెట్లు తదితర చర్యలను ప్రణాళిక బద్ధంగా చేపట్టడం, జిల్లా పోలీసు విభాగం, నెల్లూరు ఆర్డీవో, వెంకటాచలం మండలం తహసిల్దార్ లతో సమన్వయం చేసుకుంటూ ముఖ్యమంత్రి నెల్లూరు జిల్లా పర్యటన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం విధులను కమిషనర్ నిర్వహించారు.

## నందగోకులం లైఫ్ స్కూల్, గోశాల, బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభంలో..

# సీఎం చంద్రబాబు నాయుడు దృశ్య మాలిక















